


# సిగ్గు-చిట్కా వైద్యం

మత్తెక్కించే మల్లెల సౌరభాలకు పులకరించిపోతూ, మదిలో రేగుతున్న చిలిపి కోరికల్ని అదుపులో పెట్టుకుంటూ గదిలో సత్తిరాజు అసహనంగా అటునుండి ఇటు, ఇటునుండి అటు పచార్లు చేస్తున్నాడు. పెళ్ళి అనుకున్న దగ్గరనుండి ఈ రోజు గురించే అనేకప్లాన్‌లు రడీ చేసుకున్నాడు. వాటినన్నిటినీ ఒకసారి మెమరీలోనికి తెచ్చుకున్నాడు. అంతలో తలుపు చప్పుడైంది. అతని భార్య తెల్లని బట్టలలో మెరిసిపోతూ తలుపు మూసి దగ్గరకొస్తుంటే సత్తిరాజు గుండెలో దడ ప్రారంభమైంది. బస్సులో ఆడవాళ్ళ చేయి తాకితేనే గిలిగింతలకు ఫీలయ్యేవాడు. అలాంటిది భార్య దగ్గరకొచ్చి పాలగ్లాసు అందించేటప్పటికి అందుకుని గటగటా తాగేశాడు.

"మీది నోరేనా? కనక అడిగింది నోరెళ్ళబెట్టి చూస్తూ.

"నోరుకాక మరేమిటి? ఆః" అంటూ నోరుచూపించాడు.

కనక నోట్లోనికి తొంగిచూసి "వావ్" అని ఏడ్చింది.

సత్తిరాజు కంగారు పడ్డాడు. చటుక్కున నోరు మూసి, సంగతి అడిగాడు.

మీ మీద నాకు అనుమానంగా వుంది. ముసలాళ్ళకు సెన్సేషన్ లేకపోతే అంతవేడి వేడివి తాగుతారు. మీలో ముసలి లక్షణాలు కనబడుతున్నాయి. అయినా మీ పళ్ళన్నీ పుచ్చిపోయాయి. పళ్ళు పుచ్చిన ఈ ముసలాడికిచ్చి నా గొంతు కోసారురోయ్ దేవుడోయ్!" ఆమె శోకాలు తీస్తుంటే మళ్ళీ నోరు మూసి.

"అదా నీ అనుమానం!" అని ఆమెను బుజ్జగించింది. లాలించి మరీ అర్థం అయ్యేలా చెప్పాడు. ఆమె ఏడుపులో అంతకు ముందు గుర్తుకు తెచ్చుకున్న ప్లాన్‌లు ఒక్కటి గుర్తుకు రావడం లేదు. గబగబా జుట్టులోనికి వేళ్ళు పోనిచ్చి బరబరా పీకాడు. జుట్టు ఊడి చేతికొచ్చింది కాని ప్లాన్‌లు మాత్రం గుర్తుకు రావడంలేదు.

"తల గోక్కుంటున్నారేమిటి? పేలు చూడనా? పేల దువ్వెన తెస్తానుండండి" అంటూ వెనక్కి తిరిగింది. మరీ అమాయకపు టైపులా వుందేమిటి అనుకుని ఆమెను మెల్లగా మంచం మీదకు తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు.

"ఏంటలా మీద మీదకొస్తున్నారు?" అరచినట్లుగా అన్నది కనక అమాయకంగా.

ముందు జాగ్రత్తకోసం ఆమె మోరుమూసి మరింత దగ్గరకు తీసుకుని ఆమె చెవులో గుసగుసలాడాడు.

అంతే! కనక అమాంతం సత్తిరాజును ప్రక్కకు నెట్టి చటుక్కున చీరపైకి లాక్కుని మొహాన కప్పుకుని వంకర్లు తిరిగిపోయింది. ఇక సత్తిరాజు ఆనందానికి అవధులు లేవు. తన మనసు తెలుసుకున్న భార్య దొరికినందుకు పొంగిపోయాడు. ఇకరాత్రంతా ఇద్దరు నిద్రపోలేదు.

తెల్లవారు జామున సత్తిరాజుకు మెలకువ వచ్చి భార్య చెవులో గుసగుసలాడాడు. ఆమెకు హఠాత్తుగా మెలకువ వచ్చి భర్త లుంగీ బర్‌న లాక్కుని మొహాన కప్పుకున్నది.

"అదేంటోయ్ నా లుంగీ లాక్కున్నావ్!" అన్నాడు సత్తిరాజు.

"మరి నా ఒంటిమీద చీరలేదు కదా! అందుకే మీ లుంగీ లాక్కున్నాను" అన్నది కనక.

కొంతసేపటికి సత్తిరాజుకు విషయం అర్థమైంది. అంటే ఎక్కడబడితే అక్కడ సిగ్గుపడితే అమాంతం చీరపైకి లాక్కుని మొహం కప్పుకుంటుందా! అలా అనుకోగానే సత్తిరాజు గుండె గుబగుబలాడింది. కాళ్ళు గజగజ వణికాయి. చలిలోకూడా చెమటలు పట్టాయి. మంచం పట్టెను చుట్టుకుపోయి బావురుమని ఏడ్చాడు. కుందన బొమ్మలా వుందని ఏరికోరి చేసుకుంటే ఖర్మ యిలా కాలిందేమిట్రా భగవంతుడా అని వాపోయాడు. శోభనం గదిలో కేరింతలు కొట్టవలసిన వాడు దిగులుతో మునిగిపోయాడు.

*********

మూడు రోజుల తరువాత మామగారు ఖాళీగా వుండటం చూసి మెల్లగా ప్రక్కనచేరి "మామయ్యగారూ! గత మూడు రోజులుగా అత్తగారు కనిపించడం లేదేమిటి?" అని అడిగాడుసత్తిరాజు.

ఆయన భుజాన వున్న టవల్ ముఖాన కప్పుకుని బావురుమన్నాడు. సత్తిరాజు కంగారుపడి "అదేమిటండీ! కొంపతీసి అత్తంమ్య పోయారా?" అనుమానంగాఅడిగాడు.




ఆయన మొహం మీద టవల్‌తీసి "అది పోయినా నాకు కాస్త మనశ్శాంతి దక్కేది. ఏం చెప్పను బాబూ! కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. నీ చెవి ఇటు పడెయ్!" కథంతా అల్లుడి చెవిలో చెప్పి "చూడు నాయనా! ఇంతకాలం నేనొక్కడినే అని దిగులుతో కుమిలిపోతున్నాను. నాకు నువ్వు తోడు దొరికావు. ఇప్పుడు మనసుకు కాస్త వూరటగా వుంది. ఆయన కళ్ళు వత్తుకుంటూ చెప్పాడు. సత్తిరాజు ఆముదం తాగిన మొహం పెట్టాడు. మరి కన్నీళ్ళేమిటి?" అని అడిగాడు ఆనందంతో.

"ఇవి కన్నీళ్ళు కాదు నాయనా! నా బాధను సగం పంచుకున్నందుకు ఆనందంతో పొంగిన ఆనందభాష్పాలు."